క్లుప్తంగా

గంగమ్మ ఆలయానికి రూ.2 లక్షల విరాళం



నగదు అందజేస్తున్న దాతలు

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెం గంగమ్మ దేవాలయంకు భక్తులు రూ.2 లక్షల విరాళం అందించారు. ఆదివారం దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ముదిగొండ మండలంలోని గోకినేపల్లి గ్రామానికి చెందిన పాశం వీరయ్య–ఆదిలక్ష్మిల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధికి చైర్మన్ లిక్కి వీరబాబుకు నగదు అందించారు. ఈ కార్యక్రమంలో దాతలు వెంకటలక్ష్మి, ఇందిర దనియాకుల ప్రభాకర్, పాశం శ్రీను, కమిటీ సభ్యులు ఎర్రయ్య, వెంకటేష్, సతీష్, భాస్కర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ రఘురాంరెడ్డికి వినతి

ఖమ్మం లీగల్: న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, న్యాయవాద సవరణ బిల్లు 2025 పై పార్లమెంట్లో గళం విప్పాలని ఎంపీ రఘురాంరెడ్డికి ఖమ్మం బార్ అసోసియేషన్ సభ్యుడు తాళ్లూరి దిలీప్ చౌదరి ఆదివారం ఎంపీ క్యాంప్ ఆఫీస్ లో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయవాద సంక్షేమం, వారి హక్కులని కాపాడాలని వారికి సంబంధించిన అంశాలను సవరణ బిల్లులో పెట్టాలన్నారు. స్పందించిన ఎంపీ త్వరలో కేంద్ర ప్రభుత్వంకు సిఫారసు లేఖ రాస్తానని హామీ ఇచ్చారు. పసుపులేటి శ్రీనివాస్, సురేష్ గౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించాలని..



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: మండల కేంద్రం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని సీపీఎం ఆధ్వర్యంలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డికి వినతిపత్రం అందించారు. పార్టీ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, దాసరి మహేందర్, నాగేశ్వరరావు, సత్యనారాయణ, వెంకటేష్, నవీన్, వీరబాబు, రాము, మహేష్ ఉన్నారు.

మార్కెట్ చైర్మన్‌కు పరామర్శ..

రఘునాథపాలెం: ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు తండ్రి పిచ్చయ్య ఇటీవల మరణించగా ఎంపీ రఘురాంరెడ్డి వీవీపాలెం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు కొప్పుల చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ కాపా ఆదినారాయణ, వెంకటరమణ ఉన్నారు.

క్రీడా పరికరాల పంపిణీ



క్రీడా పరికరాలతో విద్యార్థులు, తదితరులు

రఘునాథపాలెం: క్రీడా చేయూత సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని వీవీ పాలెం క్రీడా శిబిరంలో ఆదివారం క్రీడా పరికరాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రూ.10 వేల విలువైన ఫుట్‌బాల్, స్పోర్ట్స్ షూస్‌ను క్రీడా చేయూత కార్యదర్శి జి. కోటిరెడ్డి చేతుల మీదుగా క్యాంప్ ఇన్‌చార్జి కె.ఆదర్శ్ కుమార్ క్రీడాకారులకు అందజేశారు. శ్రీనివాస్, సీతారాం, శ్రీహరి, శ్యాంబాబు, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం పరిధిలో ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకుడు ఘనవరపు ఉపేందర్ జెండాను ఆవిష్కరించారు. శ్రీనాథ్‌రెడ్డి, వెంకటరెడ్డి, దండి సురేష్, భాస్కర్, కిరణ్, గురవయ్య, అఖిల్ ఉన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	16	బచ్చలికూర	4
వంకాయ	24		20
బెండకాయ	26	పాలకూర	4
పచ్చిమిర్చి	36		20
కాకర	46	చుక్కకూర	4
బీర	48		20
దొండ	24	తోటకూర	4
పొట్లకాయ	40		20
చిక్కుడు	86	గోంగూర	4
గోరుచిక్కుడు	40		20
క్యాబేజీ	20	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	26	కొత్తిమీర	1
చామగడ్డ	42		30
క్యారెట్	30	పుదీన	1
క్యాప్సికం	60		20
బీట్‌రూట్	30	-ఖమ్మం వ్యవసాయం	

కనుమరుగవుతున్న డొంకరోడ్లు

రోడ్డును కమ్మేస్తున్న కంపచెట్లు

- కబ్జాకు గురవుతున్న సర్కారీ బాటలు
- అవకాశం ఉన్నా పట్టించుకోని అధికారులు
- అభివృద్ధి చేస్తే విలీన గ్రామాలకు లింక్ రోడ్లుగా..



నిరుపయోగంగా మారిన డొంకరోడ్డు..



గోపాలపురం-బల్లేపల్లి డొంక..



రోడ్డును కమ్మేసిన కంపచెట్లు..

ఖమ్మంఅర్బన్: నగర పరిధిలోని అనేక డొంకరోడ్లు ఇప్పటికే ఆక్రమణలకు గురై కనుమరుగవుతున్న పరిస్థితి నెలకొంది. గతంలో వ్యవసాయ బాటలుగా ఉపయోగపడిన ఈ సర్కారీ మార్గాలు ప్రస్తుతం రహదారి అవసరాలకు ఉపయోగపడే అవకాశం ఉన్నా అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారాయి. మండలంలో విలీన గ్రామాలైన ధంసలాపురం, పుట్టకోట, అల్లీపురం, కొత్తగూడెం, గొల్లగూడెం, టేకులపల్లి, గోపాలపురం, బల్లేపల్లి, పాండురంగాపురం, కైకొండాయిగూడెం, ఖానాపురం, రఘునాథపాలెం, టేకులపల్లి, గొల్లగూడెం తదితర గ్రామాల పరిధిలో పలు కీలకమైన డొంక రోడ్లు ఉన్నాయి. వాటిలో ముఖ్యంగా ఖమ్మం- కల్లూరు పాత డొంక, ఖానాపురం–రఘునాథపాలెం బైపాస్ డొంక, టేకులపల్లి–గోపాలపురం డొంక, గొల్లగూడెం–కొత్తగూడెం, గొల్లగూడెం–అల్లిపురం, గొల్లగూడెం–పుట్టకోట డొంకలు ప్రస్తావించ తగ్గవే.

పట్టించుకోకుంటే పూర్తిగా మాయం..

ప్రస్తుతం ఉన్న కొన్ని డొంకరోడ్లు కూడా తగిన ప్రాధాన్యం కల్పించకపోతే రానున్న రోజుల్లో పూర్తిగా మాయమవుతాయన్న ఆందోళన స్థానికుల్లో వ్యక్తమవుతోంది. రెవెన్యూ రికార్డుల్లో ఉన్నప్పటికీ, ఇవి పలు చోట్ల పేరుకే డొంక అన్నట్లుగా కనపడుతున్నప్పటికీ చాలా మేర ఆక్రమించబడ్డాయి. కొన్ని మార్గాల్లో కంపచెట్లు పెరిగిపోయి ప్రయాణానికి అడ్డుగా మారాయి. స్థానికులు చెబుతున్నట్టుగా, ఈ డొంక రోడ్లను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేస్తే నగరానికి చుట్టుపక్కల గ్రామాలకు సరైన లింక్ రోడ్లు ఏర్పడతాయి. దీని ద్వారా ప్రధాన రహదారులపై ట్రాఫిక్ భారాన్ని తగ్గించవచ్చు. అంతేకాక, విలీన గ్రామాల్లో ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగవుతాయి. వీటిని ఇప్పటికైనా గుర్తించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. లేకపోతే ఈ విలువైన సర్కారీ భూములు పూర్తిగా ఆక్రమణకు లోనవుతాయని స్థానికులు వాపోతున్నారు. ప్రజల డిమాండ్ మేరకు ఈ మార్గాలపై మున్సిపల్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సర్వే చేసి సీసీ రోడ్లుగా అభివృద్ధి చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి డొంక రోడ్లను వెలుగులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

పాత డొంకను కాపాడండి



కల్లూరు పాత డొంక అక్రమణపర్వం కాకముందే కాపాడాలి. ఈ డొంకను అభివృద్ధి చేస్తే వైరా మార్గం గుండా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు వచ్చే వాహనాలు ఈ రోడ్డును వినియోగించొచ్చు. ఫలితంగా ప్రధాన రహదారి శ్రీశ్రీసర్కిల్ వైపు ట్రాఫిక్ సమస్య తగ్గుతుంది.

– బోడ శ్రావణ్ కుమార్, గోపాలపురం

ఇప్పటికే ఆక్రమణ..



ఖానాపురం–టేకులపల్లి–రఘునాథపాలెం బైపాస్‌డొంక రోడ్డును అభివృద్ధి చేస్తే ప్రయోజనం కలుగుతుంది. ఇప్పటికే కొన్ని చోట్ల ఆక్రమణలు జరిగాయి. సర్వే చేసి హద్దులు ఖరారు చేసి, డొంక రోడ్లను అభివృద్ధి చేయాలి. అభివృద్ధి అయితే నగరంలో వారికి రవాణా పరంగా ఉపయోగకరంగా ఉంటుంది.

– ఏ.మధు, టేకులపల్లి

అభివృద్ధి చేస్తే ప్రయోజనం..



తమ వ్యవసాయ భూములకు చేరేందుకు ఉపయోగపడే పలు డొంక రోడ్లు ఉన్నాయి. కానీ ఇప్పుడు అవి కంపచెట్లతో కప్పబడి, కొన్ని ఆక్రమించబడ్డాయి. వాటిని అభివృద్ధి చేస్తే రైతులకు, అనేక కాలనీల ప్రజలకు ప్రయోజనం ఉంటుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు డొంకల అభివృద్ధిపై దృష్టి సారించాలి.

– యరదేశి నరసయ్య, టేకులపల్లి

ఉగ్రవాదాన్ని అణచడానికి యుద్ధం సరికాదు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఖమ్మం మామిళ్లగూడెం: దేశంలో రోజురోజుకీ పెరుగుతున్న ఉగ్రవాదన్ని అణచడానికి యుద్ధం ఏకైక మార్గం కాదని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఖమ్మం కైకొండాయిగూడెంలో జరిగిన ఖమ్మం డివిజన్ రాజకీయ తరగతులను ఆయన ప్రారంభించారు. ఉగ్రవాదాన్ని బలపరుస్తున్న దేశాలన్నీ అంతర్జాతీయ వేదికల మీద ఎండకట్టించాలన్నారు. భారత రాజ్యాంగం దేశ ప్రజలకు ఇచ్చిన లౌకికవాదాన్ని పాలకులు తుంగలో తొక్కుతున్నారన్నారు. రాజ్యాంగంలో లౌకికవాద ఆత్మను చంపివేస్తున్నారని లౌకికవాదాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత భారతీయ పౌరులపై ఉందన్నారు. అకాల వర్షానికి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. డివిజన్ కార్యదర్శి ఝాన్సీ ప్రిన్సిపాల్, గుర్రం అచ్చయ్య, సివై.పుల్లయ్య, కోలేటి నాగేశ్వరరావు, ఆవుల అశోక్, శ్రీను, మంగతాయి, శోభ శిరోమణి, లక్ష్మణ్, సత్తిరెడ్డి, రమేష్, సత్తార్, లెనిన్, వెంకటేష్ పాల్గొన్నారు.

రైతులు గుర్తింపుకార్డులకు నమోదు చేసుకోవాలి

నేలకొండపల్లి/రఘునాథపాలెం/కామేపల్లి: రైతులు గుర్తింపు కార్డుల నమోదు కోసం స్థానిక ఏఈవోల వద్ద ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని నేలకొండపల్లి, రఘునాథపాలెం, కామేపల్లి మండలాల వ్యవసాయాధికారులు యం.రాధ, కె.ఉమామహేశ్వర రెడ్డి, భూక్యా తారాదేవి సూచించారు. ఈ మేరకు ఆదివారం వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలు లబ్ధిపొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్ 11 అంకెల రైతు గుర్తింపు సంఖ్య తప్పనిసరి అన్నారు. సోమవారం నుంచి ఆయా రైతు వేదికలో ఏఈవోలు అందుబాటులో ఉంటారని, భూ భారతి పోర్టల్‌లో నమోదుకు భూమి ఉన్న ప్రతీ రైతు వారి ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌తో లింక్ అయిన ఫోన్‌తో ఏఈవోను కలవాలని సూచించారు. పీఎం కిసాన్ ప్రధాన మంత్రి, ఫసల్ బీమా, రాష్ట్రీయకృషి వికాస యోజన, భారత ఆహార భద్రత మిషన్ ఇలాంటి మరెన్నో పథకాలు అందాలంటే రైతు గుర్తింపు తప్పనిసరి అని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేటి సమాచారం..

'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'..

రఘునాథపాలెం: రైతులకు శాస్త్రీయ పరిజ్ఞానం చేరేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ భాగస్వామ్యంతో వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, కేవీకే (వైరా) శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నేడు(సోమవారం) ఉదయం 8 గంటలకు మండలంలోని రాంక్యాతండా రైతువేదిక జరుగుతుందని ఏఓ ఉమామహేశ్వరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాస్త్రవేత్తలు భూసారం మెరుగుపరచుకునే మార్గాలు, తక్కువ రసాయన ఎరువులతో సుస్థిరంగా వ్యవసాయం చేసే విధానాలు, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందడం, పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యాక్రమం ఉంటుందని పేర్కొన్నారు. సాగు సంబంధిత సందేహాలకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కోరారు.

ఎమ్మెల్యే పర్యటన..

కామేపల్లి: సీఎం రిలీఫ్ ఫండ్ కింద లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను సోమవారం కామేపల్లి రైతు వేదికలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

గోశాల వార్షికోత్సవం..

ఖమ్మంఅర్బన్: నగరంలోని 7వ డివిజన్ టేకులపల్లిలోని శ్రీ వేంకటేశ్వర గోశాలలో 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నేడు (సోమవారం) విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గోశాల నిర్వహకులు అర్చకులు ఆరుట్ల శ్రీనివాసచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి గోపూజ, పుణ్యాహవాచనం, శ్రీనివాస హవనం, అనంతరం స్వామి వారి కల్యాణం, అన్నప్రసాద వితరణ జరుగుతుందని అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజా వేడుకల్లో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కామేపల్లి: మండల కేంద్రంలోని కామేపల్లి హైస్కూల్ 2008–09 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి గురువులు సుధాకర్, శ్రీనివాసరావు, కొండల్‌రావు, సావిత్రి సన్మానించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదును అందజేశారు. పూర్వ విద్యార్థులు అజ్మీరా పృథ్వీరాజ్, ప్రేమ్‌కుమార్, కృష్ణ, పూజల శివకృష్ణ, ఏర్పుల మహేశ్, షేక్ హుస్సేన్, నగేశ్, రాము, ఉపేందర్, శ్రీకాంత్, స్వాతి, లలిత, తారాదేవి ఉన్నారు.

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 6వ తరగతి నుంచి 10 వరకు చదివిన 1993–98 బ్యాచ్ పూర్వ విద్యార్థులు బౌద్ధక్షేత్రం వద్ద అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువులను సన్మానించారు. కమిటీ ప్రతినిధులు దేవరశెట్టి మురళీ, నాగరాజు, శ్రీను, శ్రీకాంత్ ఉన్నారు.



ఖమ్మం సహకారనగర్: ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని డీఆర్ఎస్ డిగ్రీ కళాశాల 2002–2005 పూర్వ విద్యార్థులు ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కళాశాల యజమాన్యం మోహన్‌రెడ్డి తదితరులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కళాశాల లెక్చరర్స్ శ్రీనివాసరావు, జాఫర్ ఖాన్, నటరాజ్, పూర్వ విద్యార్థులు ఉన్నారు.



కామేపల్లిలో..



నేలకొండపల్లిలో..

నగదు బదిలీ హామీ నెరవేర్చాలి



నూతన కమిటీతో నాగభూషణం తదితరులు

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకం కింద యాదవులకు వాగ్దానం చేసిన రూ.2 లక్షల నగదు బదిలీ హామీని వెంటనే అమలు చేయాలని తెలంగాణ యాదవ మహాసభ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఖమ్మంలో ఆదివారం టీటీడీసీ భవనంలో నిర్వహించిన జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం మాట్లాడుతూ... ప్రభుత్వం హామీ నెరవేర్చకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని, యాదవులను విద్యా పరంగా ప్రోత్సహించాలని, ఇందుకోసం యాదవ మహాసభ పేదలకు అండగా ఉంటుందన్నారు. అనంతరం జిల్లా యాదవ మహాసభ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కోడి లింగయ్య, ప్రధాన కార్యదర్శిగా గుమ్మా రోశయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భారీ మల్సూర్ ఎన్నికయ్యారు. మహిళా విభాగం అధ్యక్షురాలిగా చిత్తారు ఇందుమతి, యువజన విభాగానికి జడ మల్లేష్, విద్యావంతుల వేదిక అధ్యక్షుడిగా చెక్కిలాల మోహన్‌రావు, ఉద్యోగ సంఘాల జిల్లా అధ్యక్షుడిగా అలా ప్రసాద్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘానికి చావలి నాగరాజు, వ్యాపార వర్గం అధ్యక్షుడిగా చిలకల ఆదినారాయణ, కార్యదర్శిగా పాపారావు తోపాటు మొత్తం 35 మందితో కూడిన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీలోకి ఖమ్మం జిల్లాకు చెందిన ఐదుగురు సభ్యులను నామినేట్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మేకల సుగుణ రావు యాదవ్, మాజీ కార్పొరేటర్ పగడాల నాగరాజు యాదవ్, ముక్కాల కమల యాదవ్, జంగా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

రైతుధర్నాను జయప్రదం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: పంటలకు కనీస మద్దతు ధర చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ అనుకూల జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోలేటి నాగేశ్వరరావు, కేలోతు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ నియామకం

ఖమ్మం మామిళ్లగూడెం: రాజ్యాంగ పరిరక్షణ వేదిక నూతన కమిటీని ఆదివారం ఖమ్మంలోని రాజీవ్ గృహకల్ప ప్రాంత ముస్లిం మైనార్టీలతో నియమించారు. వేదిక ఫౌండర్ సయ్యద్ సాదిక్ అలి ఆధ్వర్యంలో కమిటీ అధ్యక్షుడిగా ఎండీ.ఘని, ఉపాధ్యక్షుడిగా షేక్ రఫీ, ప్రధాన కార్యదర్శిగా జావేద్, సహాయ కార్యదర్శిగా యూసుఫ్ పాషా, కోశాధికారి, గౌరవ సలహాదారులుగా యాకూబ్, సోందు భాయ్, మహమ్మద్ ఆలీ భాయ్, అఫ్జల్, ఎండీ.ఖాజా, కార్యవర్గ సభ్యులుగా షేక్ హుస్సేన్ ఖాన్, జాకీర్, ముఖరమ్, పాషా, జానీ, అలీమ్ ఖాన్, మహమూద్, హుస్సేన్, సంధాని, జమాల్ నియమితులయ్యారు. అనంతరం పలువురిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ జేఏసీ పాలేరు నియోజకవర్గం షేక్ నజీరుద్దీన్ ఉన్నారు.

న్యాయమూర్తి మృతికి సంతాపం

ఖమ్మం లీగల్ : తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ఎంజీ.ప్రియదర్శి మృతి న్యాయరంగానికి తీరని లోటని, ఆమె జిల్లా కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తిగా ఉన్న సమయంలో ఎనలేని సేవలందించారని జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. ఈ మేరకు ఆమె మృతికి ఆదివారం సంతాపం తెలిపారు. అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు, గద్దల్ దిలిప్ కుమార్, జేఏసీ నాయకులు బిచ్చాల తిరుమలరావు, తాళ్లూరి దిలీప్ చౌదరి, పలు న్యాయవాద సంఘాలు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

మజ్జిగ పంపిణీ

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని చర్చి కాంపౌండ్‌లో మోతుకూరి చంద్రకళ రామకృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. కాంగ్రెస్ 25వ డివిజన్ అధ్యక్షుడు దాసరి పూర్ణచంద్రావు కార్యక్రమాన్ని ప్రారంభించగా పవన్, సైదులు, నరసయ్య, రాజేష్, వీరభద్రం, కొండల్, మధు, నరేష్, శ్రీకాంత్, చిట్టిబాబు, సురేష్, సత్యనందం, ఓదెలుభవాని, చైతన్య ఋషి, రాధమ్మ, శ్రీనివాస్, పురుషోత్తం, తదితరులు ఉన్నారు.

తలసేమియా బాధితులకు రక్తదానం

నేలకొండపల్లి: మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండ్రస్టీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నామ కృష్ణయ్య జన్మదినం సందర్భంగా తలసేమియా బాధితులకు రక్తదాన శిబిరంను నిర్వహించారు. మండలంలోని రాజేశ్వరపురం ఫ్యాక్టరీ వద్ద ఆదివారం కార్యక్రమంను నిర్వహించారు. తొలుత సంస్థ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కోటయ్య చేతుల మీదుగా కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీఎం (కేన్) అప్పారావు, ఏజీయం (హెచ్‌ఆర్) నరేష్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్లు ప్రారంభం

నేలకొండపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు డిగ్రీ ఆన్‌లైన్‌లో సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 21 లోపు రూ.200 చెల్లించి దోస్త్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, ఇంటర్, పది మెమోలు, ఆధార్‌కార్డు, పాస్‌ఫోటోలు, ఫోన్ నంబర్, కుల, ఆదాయ పత్రాల జీరాక్సులు అందించాలని కోరారు.

పేదలకు ప్రాధాన్యతనివ్వండి

ఖమ్మంమయూరిసెంటర్: ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రభుత్వం చెబుతున్నట్లుగా నిరుపేదలకు ప్రాధాన్యతనివ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ కోరారు. పార్టీ 29, 30, 33 డివిజన్ల సంయుక్త సమావేశం ఆదివారం త్రీటౌన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం మితి మీరుతుందని తద్వారా ప్రభుత్వ లెక్కల ప్రకారం ఎల్ 1లో ఉన్న పేదలకు సైతం అన్యాయం జరుగుతుందన్నారు. మున్నేరు రక్షణ గోడల క్రింద స్థలాలు కోల్పోతున్న వారికి తగినవిధంగా పరిహారం చెల్లించాలన్నారు. ఈ సందర్భంగా 30వ డివిజన్ కార్యదర్శిగా వల్లెపు లింగయ్య, 29వ డివిజన్ కార్యదర్శిగా నక్కా లింగయ్య, 33వ డివిజన్ కార్యదర్శిగా ఉడత అశోక్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం, నాయకులు యానాలి సాంబశివ రెడ్డి, నూనె శశిధర్, సత్యనారాయణ, భూక్యా రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

విధులు నిర్వర్తించకుండానే హాజర్లు

- హాజరు వేస్తూ కేఎంసీ అధికారుల మాయాజాలం
- రెగ్యులర్ పీహెచ్ వర్కర్లకు సహకరిస్తున్న జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు
- ఒక్కొక్కటిగా బయటకు వస్తున్న వైనం



కేఎంసీ కార్యాలయం

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీ శానిటేషన్ విభాగంలో అధికారులు, ఉద్యోగులు, కార్మికుల మాయాజాలం ఒక్కొకటిగా వెలుగులోకి వస్తున్నట్లు తెలుస్తోంది. రెగ్యులర్ పీహెచ్ వర్కర్లు విధులకు హాజరుకాకుండానే తమ స్థానంలో మరొకరిని పనిలో పెట్టి హాజరు వేయించుకొని వేతనాలు పొందుతున్నారు. క్షేత్రస్థాయిలో జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల సహకారంతో వర్కర్లు పనులు చేయకుండా తమ సొంత పనులను చక్కబెట్టుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'పురపాలన.. ఆగమాగం..' 'హాజర్‌పై నజర్..' కథనాలకు స్పందనగా ఉన్నతాధికారులు విధులకు రాకుండా హాజరు నమోదు చేయించుకుంటున్న వర్కర్లపై దృష్టి సారించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పరిధిలోని కార్మికుల హాజరు నమోదును, వారికి హాజరు సర్టిఫికేషన్ ఇవ్వడంపై ఆరా తీస్తున్నారు. ఏ వర్కర్ ఎక్కడ పని చేస్తున్నారు.. అనే విషయాలను జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ప్రశ్నిస్తున్నారు. దీంతో విధులకు నిర్వర్తించకుండా హాజరు నమోదు చేయించుకుంటున్న వారి పేర్లు బయటకు వస్తున్నట్లు తెలిసింది.

అధికారుల మాయాజాలం..

క్షేత్ర స్థాయిలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చడంలో కార్మికులతో పాటు జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పాత్ర కీలకం. ఆయా డివిజన్లను పారిశుద్ధ్యంలో మెరుగుపర్చాల్సిన బాధ్యత వారిదే. అయితే ఇక్కడ కొంత మంది జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పలువురు రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ వర్కర్లు పనులకు రాకపోయినా వారికి హాజరు నమోదు చేస్తున్నారని తెలిసింది. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రెగ్యులర్ వర్కర్ల వద్ద తాయిలాలకు ఆశపడి విధులకు రాకున్నా ఫుల్‌జీతం ఇప్పిస్తూ తమ మాయాజాలంను ప్రదర్శిస్తున్నారన్న విమర్శలున్నాయి. కేఎంసీకి సరిపడా కార్మికులు ఉన్నా డివిజన్లలో పనులు జరగకపోవడానికి జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లే ప్రధాన కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. నులకు రాకుండానే హాజర్లు వేయించుకుంటున్న కార్మికుల సంఖ్య పదుల సంఖ్యలో ఉంటుందని, అధికారులు మరింత లోతుగా విచారణ జరిపితే వారిని గుర్తించవచ్చనే వాదనలున్నాయి. ఆ వర్కర్లకు సహకరించే అధికారుల బండారం బయటపడుతుందనే చర్చ జరుగుతుంది. ఇప్పటికైనా రెగ్యులర్, పీహెచ్ వర్కర్లు ఎవరు ఎక్కడ పని చేస్తున్నారో..? ఏ జవాన్ కింద ఎవరెవరు ఉన్నారు..? అనే వాటిపై దృష్టిసారిస్తేనే వర్కర్లంతా సక్రమంగా పని చేస్తారని కార్పొరేటర్లు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు కూడా ఉదయం వేళ పని ప్రదేశాల్లో పర్యటించి కార్మికుల హాజరు, క్షేత్రస్థాయిలో పనులపై దృష్టిసారిస్తేనే వర్కర్ల మాయాజాలంకు అడ్డుకట్టపడుతుందని అంటున్నారు.

ఒక్కొక్కటిగా బయటకు..

విధులకు హాజరుకాని రెగ్యులర్ పీహెచ్ వర్కర్లను గుర్తించేందుకు ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే నలుగురు పీహెచ్ వర్కర్లు విధులకు హాజరుకాకుండా తమ స్థానంలో వేరొకరిని పెట్టి పనులు చేయిస్తూ హాజరు నమోదు చేస్తుండడాన్ని అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఓ రెగ్యులర్ పీహెచ్ వర్కర్ తన స్థానంలో బయట వ్యక్తిని రూ.10 వేలకు నియమించి, తాను మాంసం దుకాణం నడుపుకుంటూ వ్యాపారం నిర్వహిస్తున్నారని కేఎంసీలో చర్చించుకుంటున్నారు. 42, 35, 48, 60 డివిజన్లలో రెగ్యులర్ పీహెచ్ వర్కర్లు విధులకు హాజరు కావడం లేదని అధికారుల దృష్టికి వచ్చినట్లు తెలిసింది. 60వ డివిజన్‌లో రెగ్యులర్ వర్కర్ తన కుమారుడిని పనిలో పెట్టి తాను విధులకు రాకుండా హాజరు నమోదు చేయించుకొని జీతం తీసుకుంటున్నట్లు తెలిసింది.